సమాచారం

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 15, పచ్చిమిర్చి 45, బెండ 60, కాకర 45, దొండ 45, దోస 40, ఆలు 25, చామ 60, కీర 35, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 50, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 15, క్యారెట్ 40, చిక్కుడు 60, ఉల్లి 100 (4 కేజీలు), క్యాలీఫ్లవర్ (1) 25, సొర కాయ (కేజీ) 20, అల్లం 80, వెల్లుల్లి 90.

నేడు ఆలయ వార్షికోత్సవం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ శ్రీ వీరాంజనేయ శివాలయం 16వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు ఈ నెల 1వ తేదీన నిర్వహిస్తున్నట్లు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవచనం, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆంజనేయ దండకం, హనుమాన్ చాలీసా పారాయణం, ఆకుపూజలు, సింధూరం పూజలు, మధ్యాహ్నం, అన్న సమారాధన, సాయంత్రం భజన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

రాయదుర్గం: లక్ష్మణ్‌భాగ్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాయదుర్గంలోని పురాతన ఆలయాల్లో ఇది ఒకటి. బ్రహ్మోత్సవాలలో భాగంగా 3వ తేదీన ఆలయంలో కల్యాణం, 5వ తేదీన ఆలయ ప్రాంగణంలో రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

నిరుపేద యువతులకు ఉచిత శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: నిరుపేదలు, ప్రధానంగా యువతులకు నైపుణ్య శిక్షణ, ఆర్థిక అక్షరాస్యత లక్ష్యంగా నగరానికి చెందిన ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ సింక్రొనీ యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్, ఎన్‌జీఓ నిర్మాణ్ సంస్థలు చేతులు కలిపాయి. 'ఎడ్యుకేషన్ యాజ్ ఏ ఈక్వలైజర్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి ఈ విషయాన్ని నిర్వాహక సంస్థల ప్రతినిధులు తెలిపారు. శిక్షణ –ఉపాధి కల్పన, ఉపకారవేతనాల మంజూరు అనే 2 రకాల సేవలు ఈ కార్యక్రమం ద్వారా అందిస్తున్నామని ఈ ప్రాజెక్ట్ కింద ఫతేనగర్ పరిసర బస్తీలకు చెందిన 45 మంది యువతులు ఐటీ అనుబంధ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకోగా, 28మందికి ఎమ్ఎన్‌సీలలో ఉపాధి లభించిందన్నారు. మరో ఏడుగురికి ఉపకారవేతనాలు అందించామన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మురళీకృష్ణ


గచ్చిబౌలి: వృద్ధులకు టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్ పోలీసులు దుప్పట్లు పంపిణీ చేశారు. మంగళవారం బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో శ్రేయస్ ఓల్డేజ్ హోంను సందర్శించారు. సీ కంపెనీ యాన్వల్ రిఫ్రెష్‌మెంట్ కోర్సులో భాగంగా దుప్పట్లు, ఎల్ఈటీ లైట్లు, పండ్లు, బ్రెడ్ అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ సత్యనారాయణ, ఆర్ఐ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



మాదాపూర్: గుట్టలబేగంపేట్‌లో అక్రమంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తులను మంగళవారం జీహెచ్ఎంసీ సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దని, చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు లేకుండా షెడ్‌లు, నిర్మాణాలు చేపడితే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

ఘనంగా ఆలయ 9వ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

మియాపూర్ : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని రాజీవ్‌గృహకల్ప కాలనీలో శ్రీశ్రీ సంతాన నాగదేవత, సాయిబాబా సమేత మార్కండేయ ఆలయంలో 9వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ శ్రీకళ, వెంకటేశ్వర్లు, బసవయ్య, గోపినగర్ బస్తీ అధ్యక్షుడు గోపాల్ యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, మోహన్, లక్ష్మీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యకు నవోదయం

- ఆరవతరగతిలో ప్రవేశానికి అర్హత పరీక్ష
- వివరాలు వెల్లడించిన జేఎన్‌వీ రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ డానియల్ రత్నకుమార్





శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జవహర్‌నవోదయ విద్యాలయ ప్రధాన భవనం

రాయదుర్గం: నాణ్యమైన విద్యకు నవోదయ చిరునామా. జేఎన్‌వీలోని ఆరవ తరగతిలో ప్రవేశం కోసం దేశవ్యాప్తంగా ఒకేరోజు ఒకే ప్రశ్నపత్రంతో పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జేఎన్‌వీ రంగారెడ్డిజిల్లా ప్రిన్సిపల్ డానియల్ రత్నకుమార్ సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఉమ్మడి రంగారెడ్డిజిల్లా పరిధిలో ప్రస్తుతం ఐదవ తరగతి చదివే విద్యార్థులు అర్హులు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ప్రశ్న: ఇప్పటి వరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి వచ్చిన దరఖాస్తులు ఎన్ని ?

ప్రిన్సిపాల్ : జేఎన్‌వీ రంగారెడ్డిజిల్లా ఆరవ తరగతిలో ప్రవేశానికి ఐదవ తరగతి చదవుతున్న విద్యార్థులు అర్హులు. రంగారెడ్డి జిల్లా నుంచి 1,492 మంది, మేడ్చల్‌జిల్లా నుంచి 962, వికారాబాద్ జిల్లా నుంచి 778 మంది ఇప్పటి వరకు దరఖాస్తు చేశారు. ఫిబ్రవరి 8వ తేదీ వరకు గడువు ఉన్న నేపథ్యంలో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశముంది.

ప్రశ్న: ఆరవ తరగతిలో ప్రవేశం తర్వాత ?

ప్రిన్సిపాల్ : జేఎన్‌వీ రంగారెడ్డిజిల్లాలో ఆరవ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులకు 12వ తరగతి వరకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తాం. హాస్టల్ వసతితోపాటు ఉచితంగా పుస్తకాలు, డ్రెస్‌లు కూడా అందజేస్తాం.

ప్రశ్న: చదువుతోపాటు ఇతర అంశాలపై ఎలాంటి ప్రోత్సాహం ఉంటుంది?


ప్రిన్సిపాల్ : జేఎన్‌వీ రంగారెడ్డిజిల్లాలో చదువుతో పాటు విద్యార్థులకు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్, అన్ని రకాల క్రీడలు, ఆర్ట్స్, మ్యూజిక్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తాం.

ప్రశ్న: విద్యార్థులకు ఉన్నత విద్య కోసం ఎలాంటి శిక్షణ అందిస్తారు ?

ప్రిన్సిపాల్ : 9వ తరగతి నుంచే నీట్, జేఈఈలపై ఆన్‌లైన్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తాం. విజ్ఞానజ్యోతి పథకం కింద 11,12 తరగతి విద్యార్థులకు సైన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టేలా ప్రోత్సాహం అందిస్తాం. అదనంగా ఉపకారవేతనాలు కూడా అందిస్తారు.

ఏపీలో జూన్ నుంచి 9వ తరగతికి నూతన పాఠ్యపుస్తకం

తెలుగు పాఠ్యపుస్తక సమన్వయకర్త, రచయిత డాక్టర్ టీపీఎస్.రమేష్



ఆచార్య వెంకటేశ్వరరావుకు తెలుగు పుస్తకాన్ని అందిస్తున్న రచయిత డాక్టర్ టీపీఎస్.రమేష్

రాయదుర్గం: ఆంధ్రప్రదేశ్‌లో 2023 జూన్ నుంచి 9వ తరగతికి నూతన పాఠ్యపుస్తకాన్ని విద్యార్థులకు అందించే ప్రయత్నం చేస్తున్నామని తెలుగు పాఠ్యపుస్తక సమన్వయకర్త, రచయిత డాక్టర్ టీపీఎస్ రమేష్ అన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఏపీలో ఎస్‌సీఈఆర్‌టీ (ఎస్ఈఆర్‌టీ) ద్వారా రూపకల్పన చేస్తున్న 9వ తరగతి పాఠ్యపుస్తకానికి సంపాదకులుగా వ్యవహరిస్తున్న హెచ్‌సీయూ తెలుగు శాఖాధిపతి ఆచార్య దార్ల వెంకటేశ్వరరావును మంగళవారం మర్యాద పూర్వకరంగా కలిశారు. అనంతరం నూతనంగా రూపొందించిన పుస్తకాన్ని ఆయనకు అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్దేశానుసారం, మానవీయ విలువలకు సాహితీ విలువల మేళవింపుగా ఈ పాఠ్యపుస్తకాన్ని రూపొందిస్తున్నామన్నారు. కొత్త పాఠ్యపుస్తకాన్ని పరిశీలించడానికి ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుకు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పుస్తకాన్ని పరిశీలించిన ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉత్తమాభిరుచికి ఉన్నతాశయానికి ఈ నూతన పుస్తకం దిక్సూచిగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పుస్తకం రచయితల బృందం ప్రతినిధి డాక్టర్ వూటుకూరి వరప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి




విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న మగేంద్ర వర్మన్

భెల్ జీఎం మగేంద్ర వర్మన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలని భెల్ జీఎం మగేంద్ర వర్మన్ అన్నారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ వారి బంగారు భవితకు బాట వేయాలని ఉపాధ్యాయులను కోరారు. టీచర్లు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని మంచి ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. భెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగ కార్యక్రమం విజయవంతం చేయడంపై పాఠశాల ప్రిన్సిపాల్ రాములు, సిబ్బందిని అభినందించారు. అనంతరం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రతిభ సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో భెల్ ఎంజీఎం సూరన్ ప్రసాద్, ఐఆర్ అధికారులు అమిత్, సత్యంబాబు, సీనియర్ మేనేజర్ ఆష్లన్ దత్, ఉపాధ్యాయులు దామోదర్, కవిత, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ పరిశోధన అవార్డు



అవార్డు అందుకుంటున్న గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మోతహర్ రెజా

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ సైన్స్ గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మోతహర్ రెజాకు ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ కమ్యూనిటీ (ఐఏసీసీ) నుంచి ఉత్తమ పరిశోధకుడి అవార్డు దక్కింది. అధునాతన కంప్యూటింగ్‌లో లోతైన అభ్యాసం, సమాంతర కంప్యూటింగ్‌కు గాను డాక్టర్ రెజాకు అవార్డు ఇచ్చినట్టు విశ్వవిద్యాలయ వర్గాలు తెలిపాయి. హైదరాబాద్‌లోని సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఇటీవల జరిగిన 12వ ఐఏసీసీ సదస్సులో రాష్ట్ర కార్మిక, ఉపాధిశాఖ మంత్రి మల్లారెడ్డి, నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్బీఏ) చైర్మన్ ప్రొఫెసర్ కేకే.అగర్వాల్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. బిట్స్ పిలాని నుంచి ఎంటెక్, ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి పీహెచ్‌డీ, జర్మనీలోని ఫెడరిక్ అలెగ్జాండర్ విశ్వవిద్యాలయం నుంచి పోస్ట్ డాక్ డిగ్రీలను పొందిన డాక్టర్ రెజా కొన్నేళ్లగా వివిధ అప్లికేషన్లలో డీప్ లెర్నింగ్, హెచ్‌పీసీలపై పని చేస్తున్నట్టు పేర్కొన్నారు. అధునాతన న్యూమరికల్ టెక్నిక్‌లను ఉపయోగించి కంప్యూటేషనల్ అప్లైడ్ మ్యాథమెటిక్స్‌లో పరిశోధనలు చేశారు. ప్రసిద్ధ ఏసీసీఐ-ఇంటెక్సేట్ జర్నల్స్ పరిశోధనా పత్రాలను ప్రచురించినట్లు తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనం



తారానగర్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తారానగర్‌లో మార్వాడి సమాజ్, స్థానికులతో మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షపతియాదవ్ మాట్లాడుతూ 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉంటూ పార్టీలకతీతంగా సేవ చేస్తున్నానని గుర్తు చేసుకున్నారు. సందయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. రాబోయే రోజుల్లో రవికుమార్‌యాదవ్ చేసే సేవా కార్యక్రమాలకు తోడ్పాటునందించాలని కోరారు. బీజేపీ నాయకుడు రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో అధికార పార్టీ అరాచకాలు ఎక్కువయ్యాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లేగల వెంకటరెడ్డి, బీజేపీ నాయకులు ఎల్లేష్, అనిల్ కుమార్ యాదవ్, మాల్చంద్, రాజ్‌కమల్, బచ్చు రాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు

మాదాపూర్: అక్రమ పార్కింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మాదాపూర్ ట్రాఫిక్ సీఐ నర్సయ్య అన్నారు. మాదాపూర్‌లోని ప్రధాన రహదారుల పక్కన పనికి రాని వాహనాలు, అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలను మంగళవారం తొలగించారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలపడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. వ్యాపారాలను నిర్వహించుకునే వారు పార్కింగ్‌కు బాధ్యత వహించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే లక్ష్యమని కార్పొరేటర్ పుష్ప నగేష్ తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని సాయి జ్యోతినగర్ కాలనీలో బస్తీ దర్శన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలుచోట్ల డ్రైనేజీ సమస్య ఉందని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు.తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: తాగునీటి సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటవుతున్న ప్రతి కాలనీకి రక్షిత మంచినీరు అందించేందుకు నాలుగు రిజర్వాయర్లు నిర్మిస్తున్నామన్నారు. మంగళవారం కృష్ణ బృందావన్ కాలనీ సమీపంలో రూ.4కోట్లతో రిజర్వాయర్ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నరసింహగౌడ్‌లతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వాల హయాంలో అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ప్రతిరోజు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం సీఎం కేసీఆర్ చొరవతో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు అందిస్తున్నామని తెలిపారు. రిజర్వాయర్ల నిర్మాణం పూర్తయితే.. ప్రతిరోజు 1 కోటి 25 లక్షల లీటర్ల నీటిని పంపిణీ చేస్తామన్నారు. అనంతరం ఎన్‌బీఆర్ కాలనీలో ఎమ్మెల్యే పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, సంబంధిత మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లతో చర్చించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ సుజాత, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిద్రరావడం లేదని ఓఆర్ఆర్‌పైకి వెళ్లి..

- ఫొటో తీసుకుని రోడ్డు దాటుతుండగా కారు ఢీ
- తీవ్రగాయాలై అక్కడికక్కడే వ్యక్తి మృతి

పటాన్‌చెరుటౌన్: నిద్ర రావడం లేదని తోటి స్నేహితుడిని తీసుకొని ఔటర్ రింగ్ రోడ్డుపైకి వెళ్లాడు. ఫొటోలు దిగి తిరిగి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రామానాయుడు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి బతుకుదెరువు కోసం ఏడాది క్రితం ముఖేష్(47), అతడి స్నేహితులు వచ్చారు. మండల పరిధిలోని రామేశ్వరంబండ గ్రామ సమీపంలో ఉంటున్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 30వ తేదీన కూలీ పనికి వెళ్లి రాత్రి ఇంటికి వచ్చారు. నిద్ర రావడం లేదని రామేశ్వరంబండ సమీపంలో ఉన్న ఓఆర్ఆర్‌పైకి ఫొటోలు దిగేందుకు ముఖేష్, అతడి స్నేహితుడు విజయ్ కలసి వెళ్లారు. ఫొటోలు దిగి తిరిగి రోడ్డు దాటుతుండగా శామీర్‌పేట్ నుంచి గచ్చిబౌలి వెళ్తున్న కారు ముఖేష్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



మైత్రీనగర్‌లో యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్

ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. మంగళవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మైత్రీనగర్ ఫేజ్ 3లో సుమారు రూ.65లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రతి డివిజన్‌లో ఒక కిలోమీటర్ చొప్పున భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ మంజూరు చేయడం జరిగిందన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో జలమండలి జీఎం రాజశేఖర్, డీజీఎం నాగప్రియ, మేనేజర్ పూర్ణేశ్వరి, నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మారెడ్డి, వెంకటయ్య, అన్వర్ షరీఫ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మక్తమహబూబ్‌పేట గ్రీన్‌వ్యాలీ కాలనీలో..

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని మక్త మహబూబ్‌పేట గ్రీన్‌వ్యాలీ కాలనీలో రూ.65లక్షలతో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ జలమండలి అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జలమండలి జీఎం రాజశేఖర్, డీజీఎం నాగప్రియ, మేనేజర్ సాయిచరిత, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీపై పైలెట్ సర్వే

డెక్కన్ మాల్ ఘటనతో కదిలిన యంత్రాంగం



వినాయక్‌నగర్‌లో సర్వే చేస్తున్న అధికారుల బృందం

గచ్చిబౌలి: సికింద్రాబాద్‌లోని డెక్కన్ మాల్‌లో చోటు చేసుకున్న భారీ అగ్ని ప్రమాదంతో అధికార యంత్రాంగం కదిలింది. ఫైర్ సేఫ్టీపై పైలెట్ సర్వేను ప్రారంభించారు. మంగళవారం గచ్చిబౌలిలోని వినాయక్‌నగర్, మాదాపూర్‌లో రెండు బృందాలు సర్వే నిర్వహించారు. కమర్షియల్ భవనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫైర్ సేఫ్టీకి సంబంధించిన అనుమతులు లేని భవనాలే ఎక్కువగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఫైర్ సర్వీస్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఎలక్ట్రికల్, లా అండ్ ఆర్డర్ పోలీసు బృందం ఈ సర్వేలో పాల్గొంటున్నాయి. మాదాపూర్ ఫైర్ ఆఫీసర్ జగన్మోహన్, వెస్ట్ జోనల్ ఏసీపీ సురేందర్ రెడ్డి, టీపీఎస్ రమేష్, ఎస్ఐ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



గౌతమినగర్ కాలనీలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

మియాపూర్: చందానగర్ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గౌతమినగర్ కాలనీలో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను కూడా వెంటనే ప్రారంభించాలన్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కంటి వెలుగు కేంద్రం పరిశీలన..

చందానగర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కేంద్రాన్ని కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

హెచ్‌సీయూలో ఏబీవీపీ నిరసన



డిమాండ్లు పరిష్కరించాలంటూ నిరసనకు దిగిన ఏబీవీపీ నాయకులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లోని పరిపాలనా భవనం ముందు మంగళవారం ఏబీవీపీ హెచ్‌సీయూ శాఖ అధ్యక్షురాలు నమ్రతాసింగ్ ఆధ్వర్యంలో పలువురు ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా నమ్రతా సింగ్ మాట్లాడుతూ హెచ్‌సీయూ విద్యార్థులకు లంచ్‌లో రోటీలు అందించాలని, ఎఫ్, జీ మెస్‌లో కుకింగ్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. క్యాంపస్‌లోని లేడీస్ హాస్టళ్లలో శానిటరీ న్యాప్‌కిన్స్ డిస్పోజబుల్ మిషన్లు ఏర్పాటు చేయాలని, గోప్స్, నార్త్ ఎల్‌హెచ్, వివేకానంద అమెనిటీస్ సెంటర్‌లలో క్యాంటీన్‌లను ప్రారంభించాలన్నారు.హెల్త్ సెంటర్‌లో 24 గంటల పాటు డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శ్రావణ బాలా, ప్రణవ్, సాక్షి, సందీప్, నేహ, మానసి, సిద్ధాంత శ్రీకుట్టి, ఫణీంద్ర, అక్షయ్, సంగమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవే చిరస్థాయిగా నిలుస్తుంది

- గూడెం మధుసూదన్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్ చెరు): ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సర్వసాధారణమేనని, ఉద్యోగిగా ప్రజలకు చేసిన సేవే చిరకాలం నిలిచి పోతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గూడెం మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో నరేందర్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధిలో నరేందర్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సర్కిల్ అధ్యక్షుడు పరమేశ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

గోపన్‌పల్లిలో భక్తుల సందడి



విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, భక్తులు

రాయదుర్గం: భక్తుల జయజయధ్వానాలు...అర్చకుల మంత్రోచ్చారణల మధ్య గోపన్‌పల్లిలో ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా సాగింది. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లిలో నూతనంగా ఎల్లమ్మతల్లి ఆలయ నిర్మాణం చేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో గోపన్‌పల్లి, పరిసరగ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనం సమర్పించారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి దంపతుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీకలు మన వన దేవతల పర్వదినాలన్నారు. అనంతరం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్, కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రవీంద్ర ప్రసాద్ దూబే తదితరులు పాల్గొన్నారు.

